
# బతుకు బరువు

వి. వాణిప్రసాద్



చంద్రి గుండెల్లోని దుఃఖంలా బయట వర్షం నింగి నేలలను ఏకం చేస్తూ కురుస్తున్నది.

ఆ బీద గుండెల్లో పొంగే బాధలా ఆ ఊరి ఏరు హోరున శబ్దిస్తున్నది. ఒంటరి బ్రతుకులోని ఆవేదనలా గుడిసెలోని దీపం రెపరెపలాడుతున్నది నిస్తేజమైన చంద్రిచూపులా తోడునీడలేని బ్రతుకులా చిమ్నీ మసిబారింది. కప్పుకున్న ఒక్క దుప్పటినీ నిద్రలోనే చెరోవైపుకు లాక్కుంటున్న రామన్న లక్ష్మణులు, కన్నీటితో నిండిపోయిన చంద్రి కళ్ళకు మసగ్గా కన్పిస్తున్నారు. జారిపడ్డ కన్నీళ్ళు ఒలికిపోయిన జీవన మాధుర్యంలా చెదిరిపోయాయి అలో్నా తను పడ్డ మాటలు మళ్ళీమళ్ళీ విన్పిస్తున్నాయి చంద్రికి

కఠినంగ, గుండెను బ్రయ్యలుచేసే ఆ మాటలు వింటూ కూడ తప్పనిసరిగా పనిలోనే ఉండిపోయింది.

"లోకం బరి తెగించింది పిదపకాలం, పిదప బుద్ధులు. మొగుడుచచ్చి దినాలు ఎళ్ళీ ఎళ్ళకముందే పన్లోకొచ్చిందే ఇది ఆ నాయుడు పెళ్ళాంచూడు పాపం నాయుడు పోయి మూణ్ణెల్లయినా మనిషి కనిపించి, పలకరిస్తే చాలు బావురుమంటున్నది. ఇదీ ఉంది ఎందుకు? ఆడదాని పరువు తీయటానికి కాకపోతే..." నిరసనగా అంటు బుగ్గలు నొక్కుకుందో ఆడకూలి. పొర్లివస్తున్న దుఃఖాన్ని భూమాతకు విన్నవించుకోటానికా అన్నట్లు చప్పున వంగి తలదించుకుంది చంద్రి. చేతిలోని వరి నారును దోయల్లో నాటటానికి ప్రయత్నించింది. కళ్ళకు నీటిపొర క్రమ్మి క్రింద భూమిగాని, చేతిలోని నారుకాని కన్పించలేదు.

"నీకెందుకసే, ఎవరికష్టం ఆరిది. ఎవరి బతుకారిది. బేగి కానీండెహె" అంటూ పనిలోకి వంగేలా చేసింది మరో ఆడకూలి.

ఎట్లాగో పనివేళయ్యేదాకా ప్రాణాలుగ్గబట్టుకుని, కూలి తీసుకుని గూటికి చేరింది చంద్రి పైసలిచ్చి కొడుకుని నూకలకని పంపేసి ముఖం చేతుల్లో దాచుకుని మరీ ఏడ్చింది. ఎవరూ ఆర్పలేని, తీర్చని దుఃఖాన్ని ఏడ్పు ద్వారానైనా ఉపశమింప చేసుకోవటానికి ప్రయత్నించింది చంద్రి. కాని; ఎదురైన కష్టాన్ని, రాజన్న లేని లోటును భరించక తప్పదు కదా!?

ఔను...

రాజన్నపోయి పదిహేనురోజులే అయింది. నిజమే.. కాని ఈ పదిహేను రోజులు తను, పిల్లలు ఏం తిన్నారో, తినలేదో, ఎలా ఉన్నారో చంద్రికి మాత్రమే తెలుసు.

కళ్లలో ప్రాణాలు పెట్టుకుని "అమ్మా! ఆకాలే ఆకలేస్తోందే!" అని లోపలికి పోయిన కడుపులతో తన ముందు నిలబడితే......ఇంట్లో పెట్టటానికేం లేక గుండె రాయి చేసుకుని, దుఃఖాన్ని ప్రక్కకు నెట్టి, ఓపిక కూడదీసుకుని ముఖం చాటు చేసుకుంటూనే పన్లోకి వెళ్ళింది చంద్రి.

పిదప బుద్ధిని ఎగతాళి చేశారే కాని తిండి ముక్కాడ లేని తన అతీగతిని ఎవరు చూశారు? ఎవరు పట్టించుకున్నారు?

ఆడదాని పరువు తీశావని ఎద్దేవ చేశారే కాని ఆ ఆడతనంలో అమ్మను ఎందుకు గుర్తించలేక పోయారు??

నాయుడి పెళ్ళాం గురించి గొప్పగా చెప్తున్నారు. కాని నాయుడి పిల్లలు "అమ్మా! ఆకలి. .అన్నం పెట్టవే" అని ఏడుస్తున్నారా? వాళ్ళ ఆకలిని తీర్చలేని దరిద్రం లేదే ఆ అమ్మకి??

తనో.. తన రాజన్న తన ఆశ, సంతోషం తీసికెళ్ళిపోయాక, తననే అంటి పెట్టుకుని, దీనంగా, బిక్కముఖాలతో చూస్తున్న బిడ్డల కోసం బతుకుతున్న అభాగ్యురాలు, దిక్కులేని ఒంటరి.

చంద్రి కళ్ళముందు భవిష్యత్తు ఓ ప్రశ్నలా నిలబడి భయపెడుతున్నది. ఔను...

తల్లి దండ్రి వరద పాలైపోతే జ్ఞానం వచ్చే వరకూ అమ్మమ్మే ఆధారమూ, తోడు నీడ అయింది. పెద్ద తనంలో పడిన శరీరం పనికి



కీ.శే. దామోదరం సంజీవయ్యగారి ఆంగ్ల ప్రసంగాలను తెలుగులోకి అనువదించిన శ్రీ సిద్ధాని నాగభూషణంగారికి సన్మానం చేస్తున్న ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి. రామారావు. ఈ సభకి లోకాయుక్త శ్రీ ఆవుల సాంబశివరావు అధ్యక్షత వహించారు. జస్టిస్ శ్రీ కె. పున్నయ్య తెలుగులో సంజీవయ్యగారి ప్రసంగాలని ఆవిష్కరించారు.

# బతుకు బరువు

ఓర్వలేక ప్రాణం పడితే, అంత వరకూ ఇంటి పట్టునే పని పాటలు నేర్చుకుంటున్న చంద్రి తమ ఇద్దరి బ్రతుకుతెరువు వెతుక్కుంటూ ఏటి ఒడ్డుకు వచ్చింది.

ప్రయాణీకుల సామానులు పడవలోకి చేర వేస్తూ, వాళ్ళిచ్చే పావలో, అర్ధో తీసుకుని బ్రతుకు సాగిస్తున్న చంద్రికి పడవతో పాటు పడవ రాజన్నతోనూ పరిచయమైంది.... పరిచయం స్నేహంగా...

''మనిద్దరం మనువాడదామే సెంద్రీ'' అని రాజన్న అనే దాక వచ్చింది. తొలిసారిగా, కళ్ళు విప్పుకుని రాజన్న వంక చూసింది చంద్రి. తెడ్డువేసి వేసి బిగిసిన కండలతో దృఢంగ కన్పిస్తున్న చేతులు, విశాలమైన ఛాతీ, కొన దేరిన ముక్కు, నిర్మలత్వానికి నిలయమైన కళ్ళు ఆత్మీయంగ నవ్వే పెదాలు, రంగు తక్కువే అయినా నిగనిగలాడే శరీరం, చెక్కిన శిల్పం వంటి అన్నిటికీ మించి అతని మంచితనం నచ్చింది చంద్రికి... 'ఊ' అనేసింది. మనువాడారు.

ప్రయాణీకులకు సాయపడుతూ, రాజన్నతో పాటే పడవపై ఆ ఒడ్డు నుండి ఈ ఒడ్డుకు ఈ ఒడ్డు నుండి ఆ ఒడ్డుకు పోతుంటే పడవ పూల తేరులా అన్పించేది చంద్రికి.

ఏటి అలలపై వీచే గాలి తియ్యని పాటలు విన్పిస్తున్నట్లుండేది. ఎగిరే పిట్టల్లాగే తన మనసూ మబ్బుల్లో ఎగురుతున్నట్టు అన్పించేది. ఎడి దుడుకులు లేక సాగిపోయే పడవలో ప్రయాణం తన ప్రస్తుతపు జీవితంలాగే హాయిగా ఉందనిపించేది చంద్రికి.

ముందుకు సాగిపోతున్న పడవకు ఎలపోట్లా దారి యిచ్చే ఏటి నీరు తన ముందు జీవితానికి దారి ఇస్తున్నట్లు కన్పించేది చంద్రికి. ఒక్కొక్క సారి పిచ్చిప్రేమతో మోకాలి అల్లి రాజన్న మెడలో వేసి మురిపెంగ చూసుకుంటుంటే, చిలిపి చూపు చూస్తూ రాజన్న నీటిని గుండెలపై చిలకరించినప్పుడు అవి అమృతపు జల్లుల్లా, అలల సందుగుల్లా తాకి పరవశత్వాన్ని కల్గించేవి చంద్రికి.

సంతోషం పట్టలేనప్పుడు ఏదో పాట అందుకునే రాజన్న గొంతు చంద్రి గుండెల్లో గూడు కట్టి మళ్ళీ మళ్ళీ విన్పించేది.

ఏ కష్టం కలగకుండ పువ్వులా చూసుకునే రాజన్న, చంద్రి మొదటిసారి కడుపుతో ఉన్నప్పుడు... కదిలితే కందిపోతుందేమో అన్నట్లు చూసుకున్నప్పుడు 'తనను కన్నవాళ్ళు లేరు' అనే బెంగే లేకపోయింది చంద్రికి.

కొడుకు రామన్నపుట్టాడు. రాజన్నతోపాటు పడవమీద పోకుండ కొడుకును చూసుకుంటూ, గుడిసె నుండే నిలబడి తన వాడైన రాజన్న కోసం ఎదురుతెన్నులు చూసేది.

బిడ్డ పెద్దంగా మారినా, ఇంకా గూటికి చేరని రాజన్న కోసం కంగారు పడుతుంటే ''ఏమే! పిచ్చిదానా, ఆడిపోతా వాకిటనే నిలబడ్డావ్? పద... లోనికి పద... చలికి [illegible]''— అని లోపలికి తీసుకొచ్చి బుజ్జగించే వాడు రాజన్న.

''ఏటి మామా? ఇంకా వర్షంలో ఏం [illegible] ? ఏరు పొంగితే [illegible] ?'' అని చంద్రి కోపగించుకుంటే... ''పిచ్చిదానా! నీ రాజన్న గజఈతగాడే. నా ప్రాణానికేం పోకాలేదు. అవతలొడ్డున బస్సు దిగిన జనం నా కోసం నా పడవ కోసం సూస్తుంటే పడవకు లంగరేసి ఎట్టారానే? నన్ను, నా పడవను చూశాక ఆళ్ళ సంబరం నీకెలక లేందా? ఆనాటి గుహుడు నాకు గురువే మొన్న గుళ్ళో అయ్యగారు చెప్తుంటే ఇనలేదూ? రాముడు సయింగా వచ్చి నా పడవెక్కక పోవచ్చు కాని సెంద్రీ! అందరిలో రాముడున్నాడే''— అని అరిగిన చంద్రికి నచ్చచెప్పేవాడు రాజన్న.

తన బిడ్డలకు రామన్న, లక్ష్మణ అని పేర్లు పెట్టుకుని ''ఆళ్ళని నాలాగ చదువు రానోళ్ళని చెయ్యనే కూలి బతుకియ్యనే మంచి సదువులు సదివిస్తా. ఫలానా పడవ రాజన్న కొడుకులు. 'హన్నా! ఎంత గొప్పోళ్ళయ్యారు' అని అందరూ ముక్కుమీద వేలేసుకునేలా సేస్తా. ఎంత కష్టం ఎదైనా సరే''— అని కలలుకన్న రాజన్న ఆ కలల్ని ఇలలో నిజం చేసుకోకుండానే ఏ శూన్యంలోకో వెళ్ళిపోతే గుండె బ్రద్దలయ్యేలా ఏడ్చింది చంద్రి.

రామన్న లక్ష్మణుల తర్వాత ఓ కడుపు పోయి, బలహీనపడి లేవలేకపోయిన చంద్రికి, బెంగ పడిపోతూ, తల్లికంటె మిన్నగ సేవచేసి, కడుపులో దాచుకున్న రాజన్న ''ఇక మనకు పిల్లలొద్దే. ఈళ్ళిద్దరు సాలు. ఆళ్ళను బాగ పెంచి గొప్పోళ్ళను సేస్తే సాలు మొన్న మనూరి కొచ్చిన డాక్టరు సెప్పినట్టు ఆ(పెరేషన్) సేయించుకుంటానే'' అని డాక్టరు దగ్గరకెళ్ళిన రాజన్న

తనకున్న ఒక్క పుట్టింటి బంధువు, తనను రాజన్నకు తోడయ్యేవరకూ అండగ ఉన్న అమ్మమ్మ పోతే ''పిచ్చిదానా! సావు బతుకులు మనసేతిలోనా? ఇయ్యాల అమ్మమ్మ. రేపు నేనో, నువ్వో, ఎవరి బతుకు శాశితమే. బగవంతుడు కబురంపేదాక బతకాలి. సిబ్బవంగా నే నవ్వుతూ పోవాల ఏడవకే సెంద్రీ. నువ్వేడిస్తే నే సూడలేనే.'' అని ఓదార్చి, తనకు తెలిసిన సత్యాన్ని బోధించాడు.

చంద్రికి తండ్రి, తోడు నీడ, ప్రాణం — జీవితం అన్నీ అయిన రాజన్న అటువైపున్న ప్రయాణీకులకోసం పడవ తీసుకెళ్తుంటే వర్షం మొదలై ఉధృతంగ వీచిన గాలికి, ప్రవాహ వేగానికి కొట్టుకుపోయి మూడోనాటికి శవంలా ఒడ్డుకు కొట్టుకొస్తే; రాజన్నకోసం కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్న చంద్రికా సంగతి తెలిసి ఒక్క పరుగున ఏటిఒడ్డుకు చేరింది.

ఉబ్బిపోయి, చేపలు కొరకగా భయంకరంగా ఉన్న రాజన్న శరీరాన్ని చూసి ఆ రాజన్నేనా ఈ రాజన్న!? తన ప్రాణం రాజన్న అని మూర్ఛ పోయింది.

తెలివి వచ్చాక, లేచి... ఒకటే పరుగుతో తనూ ఆ ఏట్లోనే కలిసిపోదామని ముందు కురికింది.

జనం వెంబడి పడ్డారు.. ఆపలేకపోయారు.

కాని... కాని చంద్రి ఆగిపోయింది. . నిలిచి పోయింది.

"అమ్మా ! అమ్మా ! నాన్నా!" అనే బిడ్డల పిలువు, ఏడువు పేగు కదిలించింది... గుండె కరిగించింది... ప్రేమ ప్రవహించింది. వెనక్కు తిరిగి చూసింది.

దీనంగా... దీనాతి దీనంగా తనవైపే పరుగెత్తుకొస్తున్న తన బిడ్డలు, తన కడుపు పంటలు .. ఉహూ... తన రాజన్నకు ప్రతి రూపాలకోసం వెనక్కు మళ్ళింది.

తను బ్రతికి కలలు పండించాలనుకుంది.

కాని... బిడ్డల్ని కావలించుకుని ఏడ్వటమే తప్ప వాళ్ళకేంకావాలో కనుక్కోలేకపోయింది.

అప్పటికి వాళ్ళను చేరదీసి, వాళ్ళ ఆకలిని ప్రక్కింటి తల్లి తీర్చింది. అలా ఒకరోజు .. రెండో రోజు... తర్వాత ? తర్వాత ?? మెల్ల మెల్ల మెల్లగా దుఃఖాన్ని ప్రక్కకు నెట్టుతూ ఇంట్లో ఉన్న బియ్యమో, నూకలో, జొన్నలో ఏదో వండి వాళ్ళకి పెట్టింది.

ఆకలితో నకనకలాడుతున్న పేగులు పెడుతున్న బాధను తట్టుకోవటంకోసం కంచంలో పెట్టుకున్న ముద్దనోట్లో పెట్టుకోబోతుండగా...

ప్రేమతో రాజన్న తననోటి కందించిన ముద్ద గుర్తుకువచ్చి వలవలా ఏడ్చింది కన్నీళ్ళు పెదవులపై ప్రాకి వర్తమానంలాగే ఉప్పగా తగిలాయి జిహ్వకి. తమ చిన్నారి చేతులతో తల్లి కన్నీళ్ళు తుడిచి మరో ముద్ద నందించారు రామన్న లక్ష్మణులు... తండ్రికి వారసులుగా. బిడ్డల్ని చూసుకుంటు తనూ తిన్నాననిపించింది చంద్రి

కాని......అవీ నిండుకుంటే.... ఎక్కడా పుట్టకపోతే, ఆ ఆకలి తీరేదెలా ? ? . .తను ముడుచుకు పడుకుంటే ఆ బిడ్డలూ పడుకోగలరా ? ?..."అమ్మా ! ఆకలే.. ఆకలేస్తుందే" అన్న వాళ్ళ రోదనే చంద్రిని లేపింది. 'బగమంతుడా ! మనిషికీ ఆకలి నెందుకుపెట్టావయ్యా ?!"—అని కన్పించని ఆ భగవంతుడ్ని అడుగుతూనే విధిలేక పన్లోకి వెళ్ళింది.

కాని ..అక్కడ తనతోటి ఆడదే తన నన్న మాటలు మనసును తూట్లు చేస్తుంటే, తనకు రాజన్న అంటే ప్రేమలేదా ?...దిగులు లేదా ? బాధ లేదా ? ... రాజన్న మంచితనానికి మెచ్చుకున్న ఈ జనం ఆ రాజన్నే ఏటిపాలయితే ఆడి పెళ్ళాం పిల్లల గురించి పట్టించుకోలేదేం ? ? ఎదుటవాని మంచిని గురించి మెచ్చుకున్న ఈ మనుషుల్లో మంచితనం ఎండమావేనా ?

తోటి ఆడదాన్ని ... అంత గుండెలేని మాట అనగల్గిన ఆమెకి బిడ్డల ఆకలి తెలీదా ? బతుకు బాధ తెలీదా ? ?

బగమంతుడా ! బుద్ధి తెలిసేనాటికి తల్లిని, తండ్రిని కరువుపాలు ... ముసలమ్మను ఆసరా ఇచ్చావు. అదీ లాక్కున్నావు. మళ్ళీ ఓ మంచి తోడునూ కూర్చావు. ఓ గూడును ఇచ్చావు. కడుపు పంట పండించావు. చివరికి ఒంటరిగానే ఈ మనుషులలో ... శపించావు. ఇట్లాంటి మనులషు మధ్య నా బిడ్డలను పెంచి, నా రాజన్న కలల నెలా పండించగలను ? అయినా తప్పదు...

అందుకు ధయిర్యాన్ని, బలాన్నీ నువ్వే ఇవ్వు తండ్రీ ! అదీ నీ భారమే. ఇకనాకు అన్నీ నువ్వే ...అని ఏనాడో, రాజన్న ... గోడకు తగిలించిన; అభయం ఇస్తున్నట్లున్న సీతారాముల పఠానికి చేతులెత్తి నమస్కరించింది చంద్రి

'జీవితమంటేనే కష్టసుఖాల కలయిక. ధైర్యంగా నీ కర్తవ్యం నువ్వు నెరవేర్చు. అన్నింటికి నేనున్నానని'— రాములవారు అంటున్నట్టుగ అన్పించింది చంద్రికి.

లేచి కొడిగడుతున్న దీపానికి, సీసాలో ఉన్న కొద్దిపాటి చమురును పోసింది. ఆ క్రొత్త వెలుగులో పఠంలోని రాములవారి చిర్నవ్వు మరింత వెలిగింది. చంద్రి గుండె తేరుకుంది.

రామన్న లక్ష్మణులు ప్రశాంతంగా నిద్రపోతున్నారు.

వర్షపు జోరు, ఏటి హోరు నెమ్మదించింది. ★

## చదివే కంప్యూటర్ !

... చేయబడిన ... ఒక కొత్త కంప్యూ... ... కొనటానికి ... దీని ... ఉంచిన పేజీలోని మాటలను ఈ కంప్యూటర్ చదువుతుంది. కంట్రోలు ప్యానెల్ సహాయంతో కంప్యూటర్ పఠన వేగాన్ని తగ్గించుకొనవచ్చు, హెచ్చించుకొనవచ్చు. ఈ యంత్రం, పేజీలోని పంక్తులను మళ్ళీ మళ్ళీ చదువగలదు. స్పెల్లింగ్ చెప్పగలదు. కామా, ఫుల్‌స్టాప్ మొదలైనవి కూడా చెప్పగలదు. దీని వెల సుమారు 30 వేల డాలర్లు.

జిరాక్స్ కార్పొరేషన్ అనుబంధ సంస్థ దీనిని తయారుచేసింది. జిరాక్స్ కార్పొరేషన్ అమెరికాలో కెల్లా పెద్ద ఎలెక్ట్రానిక్ సంస్థ. ఈ సంస్థ 200 పఠన యంత్రాలను దేశవ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాలకు యూనివర్సిటీలకు విరాళంగా ఇచ్చింది.

